సాక్షి
తిరుపతి
శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024





## కొనసాగుతున్న ఉద్రిక్తత

కరకంబాడి రెవెన్యూ సర్వే నంబర్ 153లో జరుగుతున్న భూ ఆక్రమణలపై ఆందోళన ఉద్రిక్తత మధ్య కొనసాగుతోంది. - IIలో



## చరిత్రలో నిలిచేలా ఆడుదాం-ఆంధ్ర

రాష్ట్ర చరిత్రలో నిలిచేలా ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. - IIలో



## వలంటీర్ ఇంట్లో చోరీ

గూడూరు 25వ వార్డు వలంటీర్ దీపిక ఇంట్లో నగదు, వెండి వస్తువులు చోరీ జరిగాయని పోలీసులకు ఫిర్యాదు అందింది. - IIలో

## న్యూస్‌రీల్

### ఎరువుల పంపిణీ పూర్తి


ఏపీ మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ తాయారమ్మ

**తిరుపతి అర్బన్:** రబీ సీజన్‌కు(అక్టోబర్ ఒకటి నుంచి మార్చి 31వ తేదీ వరకు) రైతులకు అవసరమైన మేరకు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలతో పాటు సింగిల్ విండో సొసైటీల ద్వారా ఎరువులను అందించామని ఏపీ మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ తాయారమ్మ పేర్కొన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఈ రబీలో 27,644 మెట్రిక్ టన్నుల ఎరువులను ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా అందించామని చెప్పారు. అందులో 26,544 మెట్రిక్ టన్నులు ఆర్బీకేలకు సరఫరా చేశామన్నారు. అందులో 23,659 మెట్రిక్ టన్నులు విక్రయించారని, ఇప్పటికీ 2,885 మెట్రిక్ టన్నుల నిల్వలు ఆర్బీకేల్లో ఉన్నాయని తెలిపారు. మరోవైపు సొసైటీలకు 1100 మెట్రిక్ టన్నులు పంపించామని, 1100 మెట్రిక్ టన్నులు విక్రయించారని స్పష్టం చేశారు. పంటలు కోత దశకు వస్తున్న నేపథ్యంలో ఎరువుల వాడకం ఈ సీజన్‌కు పెద్దగా ఉండదని స్పష్టం చేశారు. అత్యవసరం అయితే తెప్పించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

### క్రీడలతో ఉజ్వల భవిత


మాట్లాడుతున్న హాకీ క్రీడాకారిణి రజని

**తిరుపతి ఎడ్యుకేషన్:** క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసమే కాకుండా ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని భారత మహిళా హాకీ క్రీడాకారిణి ఈ.రజని తెలిపారు. తిరుపతి ఎస్వీ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమానికి ముఖ్యవక్తగా హాజరై, ప్రసంగించారు. చదువు, క్రీడలు రెండింటికీ సమ ప్రాధాన్యం ఇస్తూ రెండింటిలోనూ ప్రావీణ్యం సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందన్నారు. క్రీడలతో ఆత్మవిశ్వాసం, లక్ష్య సాధన, నాయకత్వం, ఏకాగ్రత, టీమ్ స్పిరిట్ తదితర మంచి లక్షణాలు అలవడుతాయని చెప్పారు. అలాగే దేహదారుఢ్యం, మానసిక చురుకుదనం వస్తుందని తెలిపారు. తమలో దాగున్న ప్రతిభను గుర్తించి ఆ ప్రతిభకు పదును పెడితే విజయం సొంతమవుతుందని తెలిపారు. అనంతరం రజనీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌బాబు, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల పీడీ ముస్తాక్ అహ్మద్ పాల్గొన్నారు.

### శ్రీవారి దర్శనానికి 8 గంటలు

**తిరుమల:** భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 64,635 మంది స్వామివారిని దర్శించుకోగా 19,553 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.64 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

# ఎల్లో తాత.. ఏంటీ రోత

అధినేత నాన్చుడు ధోరణి.. సోషియల్ మీడియాలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వార్తలు.. అభ్యర్థుల ప్రకటనలో దోబూచులాట.. గంటకో లీక్.. కొన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత లేమి.. ఎల్లో మీడియాలో అసత్య కథనాలు.. వెరసి టీడీపీ నేతలు, శ్రేణుల్లో గుబులు పుడుతోంది. ఫలితంగా వారు అధినేతా ఏమిటీ గందరగోళం.. ఎందుకీ మూడు ముక్కలాట.. అని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**టీడీపీ నేతల్లో గుబులు**

- పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలపై రోజుకో వార్త
- సొంత పార్టీ నేతలే అభ్యర్థుల ఖరారంటూ లీకులు
- అధినేతకు ఫోన్లు చేసి అడుగుతున్నా తమ్ముళ్లకు రాని క్లారిటీ
- ఆ సీట్లు తమకే కేటాయించారంటూ జనసేన శ్రేణుల ప్రచారం
- నాన్చుడు ధోరణిపై మండిపడుతున్న టీడీపీ శ్రేణులు



**సాక్షి, తిరుపతి :** అధినేత చంద్రబాబు తీరుతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీడీపీ శ్రేణులు తీవ్ర గందరగోళంలో కొట్టుమిట్టాడుతున్నారు. అటు ప్రకటించిన అభ్యర్థులు.. ప్రకటించని స్థానాలపై నమ్మకంతో ఉన్న నాయకులు సైతం రోజుకో వార్త విని టెన్షన్‌తో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. అభ్యర్థుల కొరతను కప్పిపుచ్చుకునేందుకే చంద్రబాబు తన ఎల్లో సోషల్ మీడియా ద్వారా లీకులు ఇస్తూ పార్టీ నాయకులను గందరగోళానికి గురిచేస్తున్నారని తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు, తిరుపతి పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులు వెతికినా దొరకడం కరువైంది. ఈ పరిస్థితుల్లో టీడీపీ–జనసేనకు సత్యవేడు, గూడూరు ఎమ్మెల్యే ఆదిమూలం, వరప్రసాద్ ఆపద్బాంధవుల్లా కనిపించారు. వారిద్దరిని బూచిగా చూపించి వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి క్యూకడుతున్నారంటూ తన ఎల్లో మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయిస్తున్నారు. ఆ ఇద్దరిని ఓ సారి ఎంపీ అభ్యర్థులని, మరోసారి అసెంబ్లీ అభ్యర్థులని లీకులు చేస్తున్నారు. దీంతో ఆ పార్టీ శ్రేణులు అధినేతపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు చేయిస్తున్న లీకులతో ఆయా స్థానాలను నమ్ముకుని ఇన్నాళ్లు పార్టీ కోసం పనిచేస్తున్న మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె డాక్టర్ హెలెన్, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ గురించి ఆలోచన చేయకపోవడంపై వారి వర్గీయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముందుగా వారి పేర్లను ప్రకటించకుండా దాగుడు మూతలెందుకని ప్రశ్నిస్తున్నారు.

**బాబు మూడు ముక్కలాట**

చిత్తూరు, చంద్రగిరి, పూతలపట్టు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, వెంకటగిరి స్థానాలకు ఇటు టీడీపీ, అటు జనసేన శ్రేణుల మధ్య తగవుపెట్టి వేడుక చూస్తున్నారని ఆపార్టీ శ్రేణులు అధినేత తీరుపై భగ్గుమంటున్నారు. పూతలపట్టు ఇదివరకే అభ్యర్థిని ప్రకటించినా.. తన సామాజిక వర్గం నేతల ఒత్తిడికి బాబు తలొగ్గినట్టు సమాచారం. అందులో భాగంగానే అభ్యర్థిని మార్చే విషయంపై ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. చిత్తూరు, శ్రీకాళహస్తి టికెట్ ఓసారి జనసేనకే అని, మరో సారి టీడీపీకే అని లీకులు చేయిస్తున్నారు. తాజాగా శ్రీకాళహస్తి ఉమ్మడి అభ్యర్థిగా బీజేపీకి కేటాయిస్తున్నట్టు పెద్ద ఎత్తున ప్రచారం చేయించారు. దీంతో ఆ స్థానాలను నమ్ముకుని ఉన్న అభ్యర్థులు అధినేత తీరుతో తలలు పట్టుకుంటున్నారు. మరో వైపు ఒకరిపై ఒకరు అధిష్టానానికి ఫిర్యాదులు చేస్తున్నారు. అందులో భాగంగా శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు తన సామాజిక వర్గం వారందరినీ చంద్రబాబుకు వద్దకు తీసుకెళ్లి బొజ్జల సుధీర్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. బొజ్జల సుధీర్‌కి ఇస్తే తాము ఎవరూ సహకరించమని తేల్చిచెప్పినట్లు సమాచారం. అలాగే చంద్రగిరి అభ్యర్థి విషయంలోనూ చంద్రబాబు పునరాలోచనలో పడిన విషయం తెలిసిందే. ఇక్కడి నుంచి తన బంధువులను లేదా ప్రముఖ పారిశ్రామిక వేత్తను రంగంలోకి దింపాలనే యోచన చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వెంకటగిరి విషయానికి వస్తే స్థానిక ఎమ్మెల్యే ఆనం రామ నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మస్తాన్‌యాదవ్‌కి ఒకరికి తెలియకుండా ఒకరితో చంద్రబాబు మాట్లాడినట్లు తెలిసింది. వెంకటగిరి టికెట్ నీకే, నీకే, నీకే అని ముగ్గురికి హామీ ఇచ్చినట్లు వెంకటగిరిలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. సూళ్లూరుపేట విషయానికి వస్తే తను అనుకున్న వారికి టికెట్ ఇచ్చేందుకు ప్రస్తుత ఆశావహుల మధ్య వివాదాలు సృష్టించినట్లు విశ్వసనీయ సమాచారం. చంద్రబాబు ప్రతి ఎన్నికల్లోనూ ఇదే తరహా రాజకీయాలు చేయడం షరామామూలై పోయిందని టీడీపీ శ్రేణులు మండిపడుతున్నారు.

**యాదవులు గుడ్‌బై**

రాష్ట్రంలోనే కీలకమైన తిరుపతి అసెంబ్లీ అభ్యర్థిత్వంపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అభ్యర్థిని ఖరారు చేయకపోవడంపై ఆ పార్టీ శ్రేణులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి అసెంబ్లీ స్థానం జనసేన వారికి అని, మరోసారి టీడీపీకే అని ఇలా రోజుకొక వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిస్తున్నారు. దీంతో ఓ వైపు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మరో వైపు డాక్టర్ హరిప్రసాద్, కిరణ్‌రాయల్ తనకే తనకే అని ఊహల్లో ఉన్నారు. ఇదిలా ఉంటే.. ఇటీవల టీడీపీ చేపట్టిన సర్వే జాబితాలో యాదవులకు చెందిన ఏ ఒక్కరి పేరు లేకపోవడంపై ఆ సామాజిక వర్గం నేతలు భగ్గుమంటున్నారు. అభ్యర్థిగా ప్రకటించకపోయినా పర్వాలేదు.. సర్వే జాబితాలో కూడా తమ సామాజిక వర్గం వారికి చోటు లేదా? అంటూ మండిపడుతున్నారు. యాదవులను టీడీపీ కేవలం ఓటు బ్యాంకింగ్ వాడుకుంటుందే తప్ప వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు ఈ 40 ఏళ్ల కాలంలో తమను ఎందుకు గుర్తించలేదని నిలదీస్తున్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకింగ్ చూసే టీడీపీకి సహకరించాల్సిన అవసరం లేదని తీర్మానం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

## తిరుపతి జిల్లా ఎస్పీగా మలికా గర్గ్



**తిరుపతి క్రైమ్:** తిరుపతి జిల్లా ఎస్పీగా మలికా గర్గ్‌ను నియమిస్తూ గురువారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రకాశం జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న ఆమె తిరుపతికి బదిలీపై రానున్నారు. తిరుపతిలో పనిచేస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డిని ప్రకాశం జిల్లా ఎస్పీగా బదిలీ చేస్తూ ఉత్తరుల్లో పేర్కొన్నారు. కాగా 2021 నుంచి మలికా గర్గ్ ప్రకాశం జిల్లా ఎస్పీగా పని చేస్తున్నారు. దీనికిముందు ఆమె కృష్ణా జిల్లాలో పనిచేశారు. ఈ వారంలోనే ఆమె తిరుపతి జిల్లా ఎస్పీగా బాధ్యలు స్వీకరించనున్నారు.

## టెక్‌ఫెస్ట్ పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, అధ్యాపకులు

**తిరుపతి సిటీ:** పద్మావతి మహిళా వర్సిటీలో మార్చి 5 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న టెక్‌ఫెస్ట్‌కు సంబంధించిన పోస్టర్లను వీసీ భారతి గురువారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగంలో సీఎస్‌సీ, ఈసీఈ, ట్రిపుల్‌ఈ, మెక్ అరేనా కోర్సులు చదువుతున్న విద్యార్థుల కోసం టెక్‌ఫెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీయడం, వినూత్న ఆలోచనలను అన్వేషించడమే టెక్‌ఫెస్ట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పలు సాంకేతిక సంస్థలకు చెందిన విద్యార్థులు ఈవెంట్లో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజిని, అధ్యాపకులు, విభాగాధిపతులు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులు

**తిరుపతి సిటీ:** ఎస్వీయూలో నాన్ టీచింగ్ ఉద్యోగులు గురువారం పరిపాలనా భవనం ఎదుట సీఎం చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కే మురళీరెడ్డి మాట్లాడుతూ నాన్ టీచింగ్ సిబ్బంది ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ సీఎం అధ్యక్షతన బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఉద్యోగి సీఎం జగనన్న చేస్తున్న మంచిని గుర్తించి, ఆయనకు అండగా ఉండాలని కోరారు. యూనివర్సిటీల్లో పనిచేస్తున్న వేలాది మంది బోధనేతర సిబ్బందికి ఈ వయోపరిమితి పెంపు ఊరటనిచ్చే అంశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అజీమ్, ముత్తువేలు, భరత్‌రెడ్డి, లీలాకృష్ణారెడ్డి, భిల్లా, మఠం బాబు, ప్రకాష్, గౌతమి, లోకేష్, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి ఎలుకల మందు పంపిణీ

**తిరుపతి అర్బన్:** వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో శుక్ర, శనివారాల్లో ఎలుకల మందును అన్నదాతలకు ఉచితంగా అందిస్తామని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.ప్రసాద్‌రావు వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ డెల్టా ప్రాంతాల్లో ఎలుకల బెడద ఎక్కువగా ఉన్నట్లు రైతులు ఫిర్యాదులు చేశారని చెప్పారు. ఈ క్రమంలో సామూహిక ఎలుకల నివారణకు మందు వంద శాతం రాయితీపై రైతులకు సరఫరా చేస్తామని చెప్పారు. అయితే ఎర తయారీకి అవసరం అయిన నూకలు, నూనె ఖర్చులను రైతులే భరించాలని తెలిపారు. అయితే ప్రభుత్వ పోరంబోకు స్థలాలకు ఎర ఖర్చును పంచాయతీ భరిస్తుందని చెప్పారు. ఒక హెక్టార్ పొలానికి 50 ఎలుక కన్నాలు ఉంటాయని, వాటికి 500 గ్రాముల విషపు ఎర సరిపోతుందని చెప్పారు. 500 గ్రాముల విషపు ఎర తయారు చేయడానికి 482 గ్రాముల నూకలు, 8 గ్రాముల బ్రోమోడయోలోన్ మందును కలిపి 10 గ్రాముల నూనెతో పాడి మందు తయారు చేయాలని సూచించారు.

## అటవీ కార్మికుల డిమాండ్లను పరిష్కరిస్తాం

- దీక్షలు విరమింపజేసిన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి
- రూ.8 వేల జీతం పెంచుతూ నిర్ణయం

**తిరుపతి(అలిపిరి):** అటవీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. టీటీడీ అటవీ కార్మికులు చేస్తున్న నిరాహారదీక్ష వద్దకు గురువారం చైర్మన్ చేరుకుని మాట్లాడారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని ప్రకటించి వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేశారు. ఈ సందర్భంగా కరుణాకరరెడ్డి మాట్లాడుతూ సమాచార లోపం, సమన్వయ లేమి కారణంగా ఈ సమస్య పరిష్కారానికి సమయం పట్టిందన్నారు. ఉద్యోగులు, అధికారుల మధ్య కుదిరిన ఒప్పందం కంటే మరో రూ.3 వేల జీతం అదనంగా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో అటవీ కార్మికుల కు రూ.13,334 నుంచి రూ.25,070కు జీతం పెరుగుతుందని తెలిపారు. మరో రెండేళ్లలో మరో రూ.3 వేలు పెరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

**కరుణాకర్‌రెడ్డి, అభినయ్‌రెడ్డికి అభినందనలు**

టీటీడీ అటవీ కార్మికులు 38 నెలలుగా చేస్తున్న నిరాహార దీక్షలను ముగింపు పలికించడం టీటీడీ చైర్మన్ కరుణాకర రెడ్డి, ఆయన కుమారుడు భూమన అభినయ్ రెడ్డి వల్లే సాధ్యమైందని సీఐటీయూ నాయకుడు కందారపు మురళి చెప్పారు. కరుణాకర రెడ్డి టీటీడీ చైర్మన్ కాగానే ఈ సమస్య పరిష్కారం అవుతుందని అనుకున్నామన్నారు. ఈ విషయంలో అభినయ్ రెడ్డి కార్మికుల పక్షాన అనేక సార్లు అధికారులతో చర్చించి వారికి న్యాయం చేశారన్నారు. తమ సమస్య పరిష్కరించి న్యాయం చేసిన భూమన కుటుంబానికి జీవితాంతం రుణ పడి ఉంటామని అటవీ కార్మికులు చెప్పారు.


నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి

# జగనన్నతోనే మహిళా సాధికారత


కార్యక్రమానికి హాజరైన డ్వాక్రా మహిళలు


తిరుపతి: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష

**తిరుపతి మంగళం :** నాలుగున్నరేళ్లల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమం కోసం అందించిన అనేక సంక్షేమ పథకాలతో మహిళా సాధికారత సాధ్యమైందని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పేర్కొన్నారు. తిరుపతి బొమ్మగుంట సమీపంలోని రామచంద్రపుష్కరిణి వద్ద గురువారం నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, ఎంపీ మద్దెల గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తొలుత రూ. 8.66 కోట్ల వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును మహిళలకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మల సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా పదవి చేపట్టినప్పటి నుంచి పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఎంపీ మద్దెల గురుమూర్తి మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రపంచమే అతలాకుతలమైనా, రాష్ట్ర ప్రజలు మాత్రం జగనన్న సంక్షేమ పథకాలతో సుభిక్షంగా జీవనం సాగించారన్నారు. చంద్రబాబు పాలనలోలాగ జన్మభూమి కమిటీలు, దళారీల ప్రమేయం లేకుండా ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల ముంగిటకే చేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అనంతరం మేయర్ శిరీష మాట్లాడుతూ జగనన్న మాట ఇస్తే వాటిని నెరవేర్చేంతవరకు నిద్రపోరన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, దేవదానం, కార్పొరేటర్లు సీకే రేవతి, కల్పనాయాదవ్, గీత, ఆదిలక్ష్మి, నరేంద్ర, తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, జేసీఎస్ జిల్లా అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, మద్దాలి శేఖర్, పార్టీ నాయకులు ఇమ్రాన్, మునిరామిరెడ్డి, సురేష్‌రాయల్ పాల్గొన్నారు.

### మహిళా పక్షపాతి జగనన్న

**దక్కిలి (బాలాయపల్లె):** ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో స్వయం సహాయక సంఘాలకు రుణమాఫీ చేసి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా నిలిచారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. బాలాయపల్లె సచివాలయం అవరణలో గురువారం జరిగిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం పూర్తి చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి స్వార్థం, స్వలాభం కోసమే పని చేశారని ఆరోపించారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఆసరా నిధుల మెగా చెక్కును మహిళలకు అందజేశారు. వీఓఏలు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. తొలుత గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వీ కార్తీక్‌రెడ్డి, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి దేవికాచౌదరి, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు ఎస్ సురేష్‌రెడ్డి, నాయకులు పీ రాంబాబునాయుడు, వీ వెంకటరమణారెడ్డి, ఆర్ వెంకటకృష్ణమనాయుడు, వీ పార్వతి, రామతులసి, సుప్రజ, గాయత్రి, సుధాకర్‌బాబు, వెంకటసుబ్బయ్య, గోపాల్ యాదవ్ , రామ్మూర్తి యాదవ్, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దక్కిలి:మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


దక్కిలి: ఆసరా సంబరాల్లో పాల్గొన్న మహిళలు

### ఘనంగా అఖండ శివనామ సంకీర్తన


సంకీర్తన నిర్వహిస్తున్న కళాకారులు

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రాంగణంలోని సాంస్కృతిక కళావేదికపై గురువారం జానపద వృత్తి కళాకారుల అఖండ శివనామ సంకీర్తన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. తిరుపతి జిల్లా జానపద వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో తిరుమల తరహాలో ముక్కంటి చెంత అఖండ శివనామ సంకీర్తన జరపాలంటూ ఏడాదిపాటు పోరాటం చేసిన సంగతి తెలిసిందే. దీంతో అఖండ శివనామ సంకీర్తన చేసేందుకు ఆలయం అనుమతించింది. తిరుపతి, నెల్లూరు జిల్లాలకు చెందిన జానపద వృత్తి కళాకారుల శివనామస్మరణతో సాంస్కృతిక కళావేదిక హోరెత్తించారు. మురళి, వెంకటయ్య, గెడి వేణు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వలంటీర్ సేవాదృక్పథం



నెల్లూరులో పింఛన్ అందిస్తున్న వలంటీర్

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడు గ్రామానికి చెందిన వలంటీర్ డీ.విజయశేఖర్ అదే గ్రామానికి చెందిన అన్నంగి రమణమ్మకు గురువారం నెల్లూరుకు వెళ్లి వితంతు పింఛన్ అందించారు. రమణమ్మ గత కొన్ని రోజులుగా నెల్లూరులోని విజయ కేర్ ఆస్పత్రిలో చికిత్సలు పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ నెల్లూరుకు వెళ్లి బాధితురాలుకి వితంతు పింఛన్ అందించాడు. వలంటీర్ సేవలపై గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.



# చరిత్రలో నిలిచేలా ఆడుదాం-ఆంధ్ర

- ముగిసిన జిల్లా స్థాయి పోటీలు
- విజేతలకు నగదు, సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందజేత
- 6నుంచి విశాఖలో రాష్ట్ర స్థాయి పోటీలు

**తిరుపతి ఎడ్యుకేషన్ :** యువతలో దాగున్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసి, ఉత్తమంగా రాణించేలా ప్రోత్సహించేందుకు రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ఆడుదాం ఆంధ్ర పేరుతో మెగా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. రెండు రోజులుగా ఎస్వీయూ క్రీడా మైదానంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి పోటీలు గురువారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్సీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను గుర్తించి వారికి సరైన వేదిక కల్పించేందుకు, వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్న సత్సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ మెగా పోటీలకు శ్రీకారం చుట్టారన్నారు. ఏడు నియోజకవర్గాల నుంచి విచ్చేసి క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన ఆయా జట్లుకు రూ.60వేలు, రూ.30వేలు, రూ.10వేలు, షటిల్ బ్యాడ్మింటన్ విభాగంలో రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు నగదు బహుమతితో పాటు ట్రోఫీ, సర్టిఫికెట్లను అందించినట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్లు ఈ నెల 6నుంచి 9వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీఓ సయ్యద్ సాహెబ్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండ్లూరు వెంకటరమణ, క్రీడాకారులు, శాప్ కోచ్‌లు, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.



క్రికెట్‌లో ప్రథమ స్థానం సాధించిన తిరుపతి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

### విజయం సాధించిన జట్లు ఇవే..

- **క్రికెట్ (పురుషులు) :** మొదటి మూడు స్థానాలను తిరుపతి, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గ జట్లు దక్కించుకున్నాయి.
- **క్రికెట్ (మహిళలు) :** మొదటి మూడు స్థానాల్లో తిరుపతి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి నియోజవర్గ జట్లు నిలిచాయి.
- **వాలీబాల్ (పురుషులు) :** మొదటి మూడు స్థానాల్లో చంద్రగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గ జట్లు నిలిచాయి.
- **వాలీబాల్ (మహిళలు) :** మొదటి మూడు స్థానాల్లో గూడూరు, చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గ జట్లు నిలిచాయి.
- **కబడ్డీ (పురుషులు) :** మొదటి మూడు స్థానాలను సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గ జట్లు దక్కించుకున్నాయి.
- **కబడ్డీ (మహిళలు) :** మొదటి మూడు స్థానాల్లో చంద్రగిరి, శ్రీకాళహస్తి, సూళూరుపేట నియోజకవర్గ జట్లు నిలిచాయి.
- **ఖోఖో (పురుషులు):** మొదటి మూడు స్థానాలను గూడూరు, చంద్రగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గ జట్లు దక్కించుకున్నాయి.
- **ఖోఖో (మహిళలు) :** మొదటి మూడు స్థానాల్లో నగరి, సూళ్లూరుపేట, చంద్రగిరి నియోజకవర్గ జట్లు నిలిచాయి.
- **షటిల్ బ్యాడ్మింటన్ (పురుషులు) :** మొదటి మూడు స్థానాలను సూళ్లూరుపేట, చంద్రగిరి, గూడూరు నియోజకవర్గ జట్లు దక్కించుకున్నాయి.
- **షటిల్ బ్యాడ్మింటన్ (మహిళలు) :** మొదటి మూడు స్థానాల్లో తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గ జట్లు నిలిచాయి.

# వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మేరిగ మురళీధర్

గూడూరు రూరల్ : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన వారు ఎంతో మంది వైఎస్సార్‌సీపీలో చేరేందుకు వస్తున్నారని అలాంటి వారిని ఆహ్వానిస్తున్నామని గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ అన్నారు. పట్టణంలోని ఆయన నివాసం వద్ద గురువారం పట్టణంలోని ఆరో వార్డుకు చెందిన సుమారు 150 మంది యువకులు వైఎస్సార్‌సీపీ అభిమాని గోవిందు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గురువారం మేరిగ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. బీ శ్రీనివాసులు, ఏ మురళి, అల్తాఫ్, బాబు, గోవింద్‌సాయి,శ్రీనివాసులు,అశోక్, రవి పాల్గొన్నారు.



బీసీ నేత వరప్రసాద్‌కు వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మోహిత్‌రెడ్డి

### వైఎస్సార్‌సీపీలో చేరిన బీసీ నేత

పాకాల: మండలంలోని మొగరాల పంచాయతీ చల్లావారిపల్లెకు చెందిన బీసీ నేత వరప్రసాద్ వైఎస్సార్‌సీపీలో చేరారు. గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి హాజరైన తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. ఆయనకు మోహిత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

# తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో డీఎస్పీల బదిలీ

**చిత్తూరు అర్బన్:** చిత్తూరు, తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో దీర్ఘకాలికంగా ఒకే జిల్లాలో పనిచేస్తున్న డీఎస్పీలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. వివరాలిలావున్నాయి.. నాయుడుపేటలో పనిచేస్తున్న రాజగోపాల్‌రెడ్డి చిత్తూరు డీఎస్పీగా, ఇక్కడ పనిచేస్తున్న వి.శ్రీనివాసరావు రాజమహేంద్రవరానికి, భీమవరంలో పనిచేస్తున్న బి.శ్రీనాథ్ కుప్పం డీఎస్పీగా, కర్నూలు దిశ డీఎస్పీ ఐ.సుధాకర్‌రెడ్డి చిత్తూరు దిశ డీఎస్పీగా, ఇక్కడ పనిచేస్తున్న బాబూ రాజేంద్రప్రసాద్‌ను కర్నూలు దిశకు బదిలీ అయ్యారు. నంద్యాలలో పనిచేస్తున్న సి.మహేశ్వరరెడ్డి పలమనేరుకు, ఇక్కడ పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డి ఆళ్లగడ్డకు, చిత్తూరు స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ వి.శ్రీనివాసరెడ్డి నాయుడుపేటకు, నగరిలో పనిచేస్తున్న కె.రవికుమార్ వైఎస్సార్ కడప జిల్లా పోలీసు శిక్షణ కేంద్రానికి, చిత్తూరు ఏఆర్ డీఎస్పీ మురళీధర్‌ను వైఎస్సార్ కడపకు పంపించారు. అలాగే అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న మహబూబ్‌బాషాను చిత్తూరు ఏఆర్ డీఎస్పీగా బదిలీ చేశారు. గుంటూరు, కర్నూలు రేంజ్‌లో పనిచేస్తున్న పలువురు సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ వారికి పోస్టింగులు ఇచ్చారు. డీఎస్పీలుగా పదోన్నతి పొంది బదిలీ అయిన వారిలో కె.శ్రీనివాసచారి తిరుమలకు, ఎస్‌డీ తేజశ్వరరావు చిత్తూరు స్పెషల్‌బ్రాంచ్‌కు, కె.నరసింహమూర్తి నగరికి బదిలీ అయ్యారు. అలాగే తాడేపల్లిగూడెంలో పనిచేస్తున్న శరత్‌రాజ్‌కుమార్ చంద్రగిరికి, గుంటూరు వెస్ట్‌లో ఉన్న బి.ఉమామహేశ్వర్‌రెడ్డి శ్రీకాళహస్తికి, తిరుమలలో పనిచేస్తున్న భాస్కర్‌రెడ్డి తిరుపతి స్పెషల్‌బ్రాంచ్‌కు, తిరుపతి ఎర్రచందనం నిరోధక విభాగంలో ఉన్న డి.మురళీధర్ ప్రొద్దుటూరు, తిరుపతిలో ఉన్న వి.గిరిధర్ ఏసీబీకి, చంద్రగిరిలో ఉన్న యశ్వంత్ జమ్మలమడుగుకు బదిలీ అయ్యారు. అలాగే తిరుపతి ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్ ఒంగోలుకు, వైఎస్సార్ కడపలో ఉన్న రమణయ్య తిరుపతికి బదిలీ చేసినట్లు ఉత్వర్వులు వెల్లువడ్డాయి.

# పలువురు సీఐల బదిలీ

**చిత్తూరు అర్బన్:** ఉమ్మడి జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ బుధవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు వీఆర్‌లో ఉన్న చిన్న గోవిందులను గంగవరం యూపీఎస్‌కు, చిత్తూరు దిశలో పనిచేస్తున్న బి.లక్ష్మన్న అనంతపురం జిల్లా శింగనమలకు బదిలీచేశారు. అనంతపురం రేంజ్ వీఆర్‌లో ఉన్న శ్రీరాముడును తిరుపతి ట్రాఫిక్‌కు, విజయకుమార్‌ను తిరుమల వన్‌టౌన్‌కు, శ్రీకాంత్‌రెడ్డిని తిరుచానూ రు యూపీఎస్‌కు, తమీమ్ అహ్మద్‌ను తిరుపతి రూరల్ యూపీఎస్‌కు, రామయ్యను చంద్రగిరి యూపీఎస్‌కు, మురళీకృష్ణను తిరుపతి సీసీఎస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

### వలంటీర్ ఇంట్లో చోరీ

**గూడూరురూరల్:** పట్టణంలోని 25వ వార్డులో పనిచేస్తున్న దీపిక అనే వలంటీర్ ఇంట్లో నగదు, వెండి వస్తువులు చోరీ జరిగినట్లు గురువారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు.. వలంటీర్‌గా పని చేసే కవిత ఫిబ్రవరి ఒకటో తేదీన సామాజిక పింఛన్ పంపిణీ చేసేందుకు బ్యాంకు నుంచి రూ.1.54 లక్షల నగదు తీసుకువచ్చి బీరువాలో ఉంచింది. ఆమె తన భర్త ఊళ్లో లేని సమయంలో తల్లి ఇంటికి వెళ్లి నిద్రిస్తుంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఇంటికి రానని ఆమెకు ఆమె భర్త చెప్పడంతో ఇంటికి తాళాలు వేసి సమీపంలో ఉన్న తన పుట్టింటికి వెళ్లింది. తిరిగి వేకువజామున ఇంటికి వచ్చి చూడగా బీరువా పగుల గొట్టి ఉండడంతో పరిశీలించి, బీరువాలోని రూ.1.54 లక్షల నగదు, వెండి వస్తులు చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. తిరుపతి నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించి, వేలి ముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవికిరణ్ తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కార్మికుల మృతి

**ఏర్పేడు:** మండలంలోని వికృతమాల రెవెన్యూలో ఉన్న డిక్షన్ కంపెనీ సమీపంలోని ఎలక్ట్రానిక్స్ మ్యాన్‌ఫాక్చరింగ్ క్లస్టర్(ఈఎంసీ-2) వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతిచెందగా మరో కార్మికుడికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు.. బీహార్ రాష్ట్రం లాలంధర్ జిల్లాకు చెందిన రోహిత్ (19),అభి(20), రాహుల్ కుమార్ (23) వికృతమాల రెవెన్యూలో ఉన్న డిక్షన్ కర్మాగారంలో కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో వారు గురువారం రాత్రి 7 గంటలకు విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరుపతికి అతివేగంగా వెళుతూ ఈఎంసీ-2 వద్ద మలుపులో వికృతమాలకు ఖాళీగా వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో రోహిత్, అభి అక్కడికక్కడే మృతి చెందారు. రాహుల్‌కుమార్ గాయపడ్డాడు. సీఐ సంఘటనా స్థ లానికి చేరుకుని పంచనామా చేసి, మృత దేహాలను పోస్టుమార్టానికి శ్రీకాళహస్తి ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడిని 108 వాహనంలో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.



సంఘటనా స్థలంలో రోహిత్, అభి మృతదేహాలు

### కరకంబాడిలో కొనసాగుతున్న ఉద్రిక్తత

**రేణిగుంట:** మండలంలోని కరకంబాడి సచివాలయ సమీపంలోని సర్వే నంబర్ 153లో వారం రోజులుగా జరుగుతున్న భూ ఆందోళన ఉద్రిక్తత మధ్య కొనసాగుతోంది. మండలంలోని కరకంబాడి పంచాయతీ తారక రామానగర్‌వాసుల పేరిట స్థానికేతరులు గుట్టపై తిష్ట వేసి, తాము ఇక్కడ గుడిసెలు నిర్మించుకుంటామని, వాటికి పట్టాలు ఇవ్వాలని భీష్మించారు. అయితే వీరు సీపీఎం నాయకుల నేతృత్వంలో స్థానికేతరులు ఇక్కడ అలజడి వాతావరణం సృష్టించడంతో రెవెన్యూ, పోలీసు అధికారులు పలుసార్లు చర్చలు జరిపినా ఆందోళనకారులు కొండ దిగలేదు. అయితే గురువారం కరకంబాడి గ్రామస్తులు అక్కడకు చేరుకుని, తమకు ఈ స్థలంలో 1992లోనే ఇళ్ల పట్టాలు ఇచ్చారని, అయితే గ్రామానికి చెందిన ఓ భూస్వామికి, ప్రభుత్వానికి మధ్య కోర్టులో వివాదం నడుస్తోందని అన్నారు. ఈ భూమిలోకి స్థానికేతరులు అక్రమంగా ప్రవేశించి, అలజడి సృష్టించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. అక్కడ నుంచి అందరూ తిరుపతి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి నిబంధనలకు విరుద్ధంగా గుట్టపైన అక్రమంగా గుడిసెలు వేసుకున్న వారిని అక్కడ నుంచి ఖాళీ చేయించి, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తమకు పట్టాలు ఇవ్వాలని ఆందోళనకారులు ధర్నా చేశారు.

**అడ్డదిడ్డంగా ఆక్రమించేస్తున్నారు**

**తిరుపతి అర్బన్:** కొందరు మా భూములను అడ్డదిడ్డంగా ఆక్రమిస్తున్నారని, ప్రశ్నిస్తే కమ్యూనిస్టుల పేరుతో దౌర్జన్యం చేస్తున్నారని కరకంబాడి గ్రామానికి చెందిన ఎస్.రవిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన గ్రామస్తులతో కలసి కలెక్టరేట్ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# ఘనంగా మినిస్టర్ వైట్ షోరూం ప్రారంభం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న పోతురాజు దంపతులు

**తిరుపతి కల్చరల్:** ఎయిర్ బైపాస్ రోడ్డు, అన్నమయ్య సర్కిల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మినిస్టర్ వైట్ వస్త్ర షోరూమ్ గురువారం ఘనంగా ప్రారంభించా రు. మినిస్టర్ వైట్ గ్రూప్ అధినేత ఎస్.పోతురాజు దంపతులు పూజ చేసి, షోరూమ్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతిలో మినిస్టర్ వైట్ షోరూమ్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడం చాలా సంతోషకరమన్నారు. మారుతు న్న కాలానికి అనుగుణంగా తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా ఆకర్షణీయమైన పంచె లు, చొక్కాలు సరికొత్త డిజైన్లలో లభిస్తాయన్నారు. ఏడాది పిల్లల నుంచి 16 ఏళ్ల యువకుల వరకు అన్ని రకాల పంచలు, ధోవతీలు, కుర్తాలు, చొక్కాలు సరసమైన ధరల్లో లభిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి క్లాత్ మర్చంట్ అండ్ రెడీమేడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామిరెడ్డి, ప్రతినిధులు, వివిధ వస్త్ర వ్యాపారులు హాజరై మినిస్టర్ వైట్ గ్రూప్ అధినేత ఎస్.పోతురాజు దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# రూట్ మార్చిన చైన్ స్నాచర్లు

**పాకాల:** చైన్ స్నాచర్లు తమ రూటును మార్చి రద్దీగా ఉన్న ప్రాంతాలను వదలి, మండల శివారులోని నిర్మానుష్యమైన ప్రాంతాల్లో మకాం వేస్తున్నారు. గతంలో చైన్‌స్నాచర్లు పట్టణంలోని పలు ప్రదేశాల్లో ఒంటరిగా నడిచి వెళుతున్న మహిళలను టార్కెట్ చేసి చోరీలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. ఇటీవల కాలంలో మండల శివారు ప్రాంతాల్లో నిర్మానుష్యంగా ఉన్న రోడ్లలో స్కూటర్లపై వెళుతున్న మహిళా ఉద్యోగులు, గృహిణుల నుంచి చైన్ స్నాచింగ్‌కి పాల్పడుతున్నారు. తాజాగా గురువారం పల్సర్ బైక్‌పై ముగ్గురు నల్ల దుస్తులు ధరించిన చైన్ స్నాచర్లు నేంద్రగుంట నుంచి పెనుమూరుకు ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరు మహిళా ఉద్యోగుల మెడల్లో చైన్ స్నాచింగ్‌కి పాల్పడడానికి యత్నించారు. అయితే అదే సమయంలో వెనుక తెలిసిన వ్యక్తి ద్విచక్ర వాహనంలో రావడంతో స్నాచర్లు పరారయ్యారు. ఈ ఘటన పాకాల మండల నేంద్రగుంట-పెనుమూరు మార్గంలో చోటు చేసుకుంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం పాఠశాలల సమయంలో ఎక్కువగా స్నాచర్లు మకాం వేస్తున్నట్లు స్థానికంగా ఉన్న పలువురు చెబుతున్నారు. పోలీసులు ఉదయం 8.30 నుంచి 9.30 వరకు, అలాగే సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు గస్తీ నిర్వహిస్తే తమకు రక్షణ ఉంటుందని మహిళా ఉద్యోగులు పేర్కొన్నారు. ఈ విషయమై ఎస్ఐ మహేష్‌బాబును వివరణ కోరగా ఉదయం, సాయంత్రం వేళల్లో నేంద్రగుంట-పెనుమూరు మార్గంలో పోలీస్‌బీట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.